# నేడు కృష్ణపట్టెకు జల నేత కేసీఆర్



దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణంలో ఫ్లెక్సీలు

- హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండలో బహిరంగ సభలు
- ప్రజా ఆశీర్వాద సభల్లో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- సభలకు ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 1.30 గంటలకు హుజూర్‌నగర్‌కు చేరుకోనున్నారు. హుజూర్‌నగర్ పట్టణంలోని రామస్వామి గుట్టకు వెళ్లే మార్గంలోని విశాలమైన స్థలంలో ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి ఆధ్వర్యంలో వారం రోజులుగా సభా ఏర్పాట్లు చేశారు. సభకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే సైదిరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం జరుగనున్న సభ కావడంతో సభికులకు అవసరమైన మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు సైతం విస్తృతంగా అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో పెద్ద సంఖ్యలో వచ్చే వాహనాల కోసం ప్రత్యేకంగా పట్టణం నలువైపులా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. హుజూర్‌నగర్ సభా అనంతరం హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ మిర్యాలగూడకు పయనం అవుతారు.

### మిర్యాలగూడ ఎన్‌ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో...

మిర్యాలగూడ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ఎన్‌ఎస్‌పీ క్యాంపు మైదానంలో ఏర్పాట్లు చేశారు. హుజూర్‌నగర్ నుంచి సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో మిర్యాలగూడకు చేరుకుంటారు. పక్కనే కొద్ది దూరంలోనే హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. సీఎం రాక కోసం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణానికి నియోజకవర్గ వ్యాప్తంగా తరలివచ్చే ప్రజలు సులువుగా చేరుకునేలా జాగ్రత్తలు తీసుకున్నారు. పట్టణానికి నలువైపులా సభా స్థలానికి కొద్ది దూరంలో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు. అక్కడే తమ వాహనాలను పార్క్ చేసి కాలినడకన సభా ప్రాంగణానికి ప్రజలు చేరుకోవాల్సి ఉంటుంది. సభా ప్రాంగణంలోనూ మంచినీరు, మజ్జిగ లాంటి అన్ని చర్యలు చేపడుతున్నారు. సభకు వచ్చే వీఐపీలు, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు ఇలా వేర్వేరుగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే భాస్కర్‌రావు వెల్లడించారు.

### దేవరకొండలోని ముదిగొండ రోడ్డులో...

దేవరకొండ నియోజకవర్గ ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు పట్టణంలోని ముదిగొండ రోడ్డులో విశాలమైన స్థలంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సీఎం కేసీఆర్ మిర్యాలగూడ నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 3.30గంటల సమయంలో దేవరకొండకు చేరుకోనున్నారు. సభాస్థలికి సమీపంలోనే ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకోనున్నారు. అక్కడి నుంచి ప్రత్యేకంగా వాహనంలో సభా వేదిక వద్దకు చేరుకునేలా చర్యలు చేపట్టారు. 2018 ఎన్నికల సమయంలోనూ ఇదే స్థలంలో సీఎం కేసీఆర్ సభ నిర్వహించారు. సభకు వేలాదిగా జనం తరలివచ్చే అవకాశాలు ఉండడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ స్వయంగా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సభా స్థలంలోనే ప్రత్యేక గ్యాలరీల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు మంచినీరు, ఇతర సౌకర్యాలు సైతం ఏర్పాటు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ రాక కోసం సర్వం సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రవీంద్రకుమార్ ప్రకటించారు.

### స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం

ఉమ్మడి జిల్లా పరిధిలో జరుగుతున్న బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ బహిరంగ సభలకు జనం తండోపతండాలుగా తరలొస్తున్నారు. ఇప్పటివరకు జరిగిన భువనగిరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు నియోజకవర్గాల ప్రజా ఆశీర్వాద సభలకు జనం పోటెత్తారు. ఏ సభలో చూసినా భారీ జన సందోహం కనిపించింది. ఆయా నియోజకవర్గాల నలుమూలల నుంచి చిన్నా పెద్దా, ముసలి ముతక, ఆడ మగ తేడా లేకుండా సభకు తరలివస్తుండడంతో అన్ని చోట్ల జన జాతర్లను తలపించాయి. ఊహించిన దాని కంటే రెట్టింపు సంఖ్యలో పార్టీ శ్రేణులు, అభిమానులు, వివిధ పథకాల లబ్ధిదారులు, సామాన్య ప్రజలు సభలకు వచ్చి కేసీఆర్ ప్రసంగాన్ని శ్రద్ధగా ఆలకిస్తున్నారు. అన్ని చోట్ల కేసీఆర్ ప్రసంగాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ఇక నేడు జరుగనున్న హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండ సభలకు సైతం వేలాదిగా తరలివచ్చేందుకు జనం సన్నద్ధం కావడం విశేషం. సీఎం కేసీఆర్ సభలకు వస్తున్న స్పందనను చూస్తుంటే ఉమ్మడి జిల్లాలో అన్ని స్థానాల్లో గులాబీ జెండాకు ఎదురుండదన్న చర్చ సాగుతోంది.



రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన చొక్కారావు, సభ్యులు

## అంధుల కొత్త చట్టాలను అమలు చేయించాలి

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు చొక్కారావు వినతి

నల్లగొండ రూరల్, అక్టోబర్ 30 : అంధులకు తీసుకొచ్చిన కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదని, అంధుల సమస్యలు వారి అర్థమవుతాయి కాబట్టి వారికే కమిషనర్ పదవులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత అంధుల సంఘాల సమాఖ్య (ఏఐసీబీ) ఉపాధ్యక్షుడు, డ్వాబ్ ప్రధాన కార్యదర్శి పొనుగోటి చొక్కారావు సోమవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి తమ సమస్యలు స్వీకరించిన రాష్ట్రపతి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. రాష్ట్రపతిని కలిసిన వారిలో ఏఐసీబీ కార్యవర్గ సభ్యులు రాతావత్ స్వామినాయక్, డి.రేణుక, శ్వేత, నాగరాజు బృందం ఉన్నారు.

## 'పర్యావరణ పరిరక్షణకు ప్రజలను చైతన్యం చేయాలి'



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

రామగిరి, అక్టోబర్ 30: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు ప్రజలను చైతన్యం చేసి విరివిరిగా మొక్కలు నాటేలా చూడాలని డీవీఎం విద్యా శిక్షణ కళాశాలల(బీఈడీ, ఎంఈడీ) కళాశాలల ప్రిన్సిపాళ్లు పి.గంగాధర్‌రావు, బి.నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బొడ్డుపల్లి రామకృష్ణ సూచించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) ఉత్తర్వుల మేరకు కళాశాలలో స్వచ్ఛభారత్ నిర్వహించడంతోపాటు మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయ శిక్షణ విద్యార్థులంతా ఎన్‌సీటీఈ ఆదేశాల మేరకు స్వచ్ఛ హిసేవలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సూపరింటెండెంట్ చొల్లేటి శ్రీధర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పల్లెల్లో కొత్త పంచాయతీ భవనాలు




వెంకట్రాంపురంలో ఇటీవల ప్రారంభించిన పంచాయతీ భవనం

- సకల సౌకర్యాలతో నిర్మాణం
- హర్షం వ్యక్తంచేస్తున్న స్థానికులు

మేళ్లచెర్వు, అక్టోబర్ 30 : ప్రభుత్వం పల్లెల ప్రగతికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రజల సౌకర్యానికి నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీలతో పాటు గతంలో ఇరుకుగా ఉన్న పంచాయతీ భవనాలను కూల్చి వాటి స్థానంలో సకల వసతులతో కొత్త భవనాల నిర్మాణం చేపట్టింది. మేళ్లచెర్వు మండలంలో మొత్తం 14 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 500 జనాభా దాటిన తండాలు, ఆవాసాలను కొత్త పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించడంతో వెంకట్రాంపురం, ఎర్రగట్టు తండా, మంగలికుంట తండా, నల్లబండగూడెం, కప్పలకుంట తడడా, రామాంజినేయ తండాలు నూతన పంచాయతీలుగా అవతరించాయి. ఆయా గ్రామాల్లో తొలుత తాత్కాలిక భవనాల్లో పంచాయతీ కార్యాలయాలను ఏర్పాటు చేశారు. కొన్ని పాత పంచాయతీల్లో సైతం భవనాలు ఇరుకుగా ఉండేవి. దీంతో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేందుకు ఈజీఎస్ నిధులతో పాటు దాతల సహకారంతో కొత్త భవనాల నిర్మాణం ప్రారంభించారు. ఇప్పటికే మేళ్లచెర్వు, రేవూరు, వెంకట్రాంపురం గ్రామాల్లో కొత్త భవనాల నిర్మాణం పూర్తికాగా వేపలమాధవరం. కందిబండ, రామాంజినేయ తండా గ్రామాల్లో తుదిదశకు చేరుకుంటున్నాయి. సకల సౌకర్యాలతో భవన నిర్మాణాలు చేపట్టడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు మంగలికుంట తండాలో దాతల సహకారంతో స్థలం సేకరించగా, ఎర్రగట్టుతండా, కప్పలకుంటతండా గ్రామాల్లో స్థలం కొరత ఉంది. స్థల దాతలు ముందుకొస్తే నిర్మాణ పనులు ప్రారంభించే అవకాశం ఉంది.



కందిబండ గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న పంచాయతీ భవనం

### పల్లె ప్రగతితో గ్రామ రూపురేఖల్లో మార్పు



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పల్లె ప్రగతితో గ్రామాల రూపురేఖలు మారిపోయాయి. మా గ్రామంలో గతంలో శిథిలావస్థ భవనంలో కార్యాలయం ఉండేది. రూ.20లక్షల ఈజీఎస్ నిధులతో నిర్మించిన కొత్త పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే సైదిరెడ్డి ఇటీవలే ప్రారంభించారు. ప్రస్తుత భవనం ప్రజలకు సౌకర్యవంతంగా ఉంది.

– బేత కల్పనావీరనాగిరెడ్డి, సర్పంచ్, వెంకట్రాంపురం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

# బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తాం
- బీసీ భవనం ప్రకటనపై సంఘం నాయకులు హర్షం

కోదాడటౌన్, అక్టోబర్ 30 : బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్ అని పలువురు బీసీ సంఘం నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ సంఘం కార్యాలయంలో సంఘం నియోజకవర్గ నాయకుడు అనంతారపు బ్రహ్మం సోమవారం పలువురు సంఘం నాయకులతో సమావేశమై మాట్లాడారు. ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కోదాడలో బీసీ భవన్ నిర్మాణానికి రూ.10కోట్లు కేటాయిస్తానని హామీనివ్వడంపై హర్షం వ్యక్తంచేశారు. కోదాడ నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సబ్బండ వర్గాల ప్రజలందరూ ఏకమై ఎమ్మెల్యేగా బొల్లం మల్లయ్యయాదవ్‌ను మరోసారి భారీ మెజార్టీతో గెలిపించి సీఎం కేసీఆర్‌కు కానుకగా ఇస్తామన్నారు. సమావేశంలో సంఘం నాయకులు పాలేటి నాగేశ్వర్‌రావు, ఈదుల కృష్ణయ్య, మట్టపల్లి శ్రీనివాస్‌గౌడ్, రహీం, గట్ల కోటేశ్వర్‌రావు, సంగిశెట్టి గోపాల్, తిరుమలగిరి రాధాకృష్ణ, గుండెల సూర్యనారాయణ పాల్గొన్నారు.